విశాలాంధ్ర
పార్వతీపురం మన్యం

పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం/ పార్వతీపురం టౌన్/ బెలగం: మార్చి నెలలో ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షల్లో శ్రద్ధగా చదివి విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆకాంక్షించారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉత్తీర్ణత సాధించాలన్న తపన, పట్టుదలతో చదవాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ గురువారం సందర్శించారు. అక్కడి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, కరచాలనం చేసి నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల వసతి గృహం మరమ్మతులు చేపట్టిన తదుపరి అందుతున్న వసతుల పరిశీలనకు వచ్చినట్లు చెప్పారు. బంగారు భవితకు పదోతరగతి, ఇంటర్ మీడియట్ కీలక మలుపునిస్తుందని, కావున ఏకాగ్రతతో చదువే ధ్యాసగా శ్రమించాలని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదవాలంటే ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ పర్యటనలో వసతి గృహం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడగండిలో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

అనారోగ్యం పాలవుతున్న ప్రజలు

విశాలాంధ్ర - సీతంపేట: మండలం, కడగండి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా, అపారిశుద్ధ్యంగా కాలువలు కంపు కొడుతున్నాయి. కడగండి గ్రామంలో పారిశుధ్య పనులు జరగకపోవడంతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్తులు ఉమామహేశ్వరరావు, చిరంజీవులు, సూర్యచంద్ర, పాలక సుబ్బారావు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ కూడా పూర్తిగా శిధిలం అవటంతో మురికి చెత్తాచెదారాలతో పేరుకుపోయిందని సంబంధిత పంచాయతీ సిబ్బంది స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని పలువురు కోరుతున్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ప్రశాంతంగా పోలింగ్

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం కేంద్రంలో భద్రగిరి గురుకుల పాఠశాల ఆవరణలో ఉత్తరాంధ్ర శాసనమండలి పోలింగ్ ప్రక్రియ గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభించారు. ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయబడింది. ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.

బోద వ్యాధి నివారణ మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర - బలిజిపేట: 95 శాతం బోద వ్యాధి నివారణ మాత్రలు పంపిణీ చేశామని బలిజిపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ కిరణ్మయి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 10వ తేదీ నుండి ఫిబ్రవరి 27వ తేదీ వరకు బోదవ్యాధి నివారణ మాత్రలు 95 శాతం వేయించామని తెలిపారు. బలిజిపేట, పెద్ద పెంకి, నారాయణపురం, పెద్దింపేట, నూకల వాడ, అంపావల్లి, వంతరం, చిలకలపల్లి గ్రామాలలో 26280 మందికి గాను 24 వేల ఎనిమిది వందల అరవై నాలుగు మందికి డిఇసి అల్బెండజోల్ మాత్రలు వేయించామన్నారు.

సీతంపేటలో 95 శాతం పోలింగ్

విశాలాంధ్ర - సీతంపేట: మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో 95 శాతం పోలింగ్ నమోదైంది. 121 మంది ఉపాధ్యాయులకు గాను 116మంది ఓటింగ్ కార్యక్రమంలో పాల్గొనగా 95 శాతం పోలింగ్ జరిగిందని తహశీల్దార్ పి.అప్పలరాజు తెలిపారు. ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరుగుటకు పాలకొండ డీఎస్పీ, సీఐ చంద్రమౌళి, ఎస్ఐ అమ్మనరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పోలింగ్ స్టేషన్లను సందర్శించిన పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరీ

విశాలాంధ్ర - సీతానగరం/ పార్వతీపురం: పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కోరెడ్ల విజయ్ గౌరి గురువారం పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతానగరం, పార్వతీపురం పలు మండలాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ముందుగా వారి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెంట్ల వద్దకు వెళ్లి మాట్లాడారు. తరువాత ఆయా పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

విశాలాంధ్ర - పార్వతీపురం/ పార్వతీపురం టౌన్/ బెలగాం: జిల్లాలో గురువారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 15 మండల కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికా, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఏ ఆర్ ఓ, జిల్లా రెవెన్యూ అధికారి హేమలతలు పరిశీలించారు. వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ తీరును పరిశీలించారు. ఓటరు స్లిప్పులను, పోలింగ్ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

దుగ్గేరులో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు మక్కువ మండలం, దుగ్గేరు గ్రామంలో మక్కువ పోలీసులు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురాన శిబిరాన్ని ప్రారంభించారు. వృద్ధులు, దివ్యాంగులకు, మహిళలకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు, యువతకు వాలీ బాల్ కిట్లు పంపిణీ చేశారు. సుమారు 500 మందికి పైగా గిరిజన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందుల పంపిణీ చేశారు. మారుమూల గిరిజన గ్రామాలకు సహాయపడుతూ, గిరిజనులకు అండగా నిలిచేందుకుగాను కమ్యూనిటీ పోలీసింగులో భాగంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. జేమ్స్ హాస్పిటల్, రాగోలు, శంబర పిహెచ్, వైద్య బృందం తమవంతు సహాయాన్ని, సేవలను అందించేందుకు ముందుకు వచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మక్కువ ఎస్సై వెంకట రమణ, శంబర పీహెచ్‌సీ వైద్యులు సాహితీ, జేమ్స్ హాస్పిటల్ వైద్య బృందం, సీఆర్‌పీఎఫ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరులో 91% పోలింగ్

విశాలాంధ్ర - సాలూరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికలో సాలూరు మండలంలో 91.2 శాతం ఓటింగ్ నమోదైంది. స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 250 ఓట్లకు గాను 228 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానానికి బరిలో పది మంది అభ్యర్థులు నిలవగా ప్రధానంగా ముగ్గురి మధ్యనే పోటీ నెలకొంది. పాకల పాటి రఘువర్మ (ఏపీటీఫ్), కోరండ్ల విజయగౌరి (యుటిఫ్), గాదె శ్రీనివాసుల నాయుడు (పిఆర్‌టియు) మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది. పాకలపాటికి కూటమి నాయకులు మద్దతు తెలుపగా, ప్రజాసంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా విజయగౌరి బరిలో నిలిచారు. పాకలపాటికి మద్దతుగా ఏర్పాటు చేసిన శిబిరానికి మంత్రి సంధ్యారాణి పోలింగ్ సమయానికే చేరుకొని ఏర్పాట్లను పరిశీలించి ఎన్నిక జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

రాధాకుమారికి ఎమ్మెల్సీ పరామర్శ

విశాలాంధ్ర - పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ మాజీ చైర్ పర్సన్ యందవ రాధా కుమారికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ గురువారం తన ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. ఇటీవల రాధాకుమారికి శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలుసుకొని ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. పదివేల రూపాయలను ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్సీతోపాటు రాధా కుమారిని పరామర్శించిన వారిలో వైసీపీ మండల పట్టణ అధ్యక్షులు కనపాక సూర్య ప్రకాష్, వెలమల మన్మధరావు, పూర్వపు కమిషనర్ లిల్లీపుష్ప నాదం, కౌన్సిలర్స్ కడగల వెంకటరమణ, తుమ్మగుంట శంకర్రావు, పి.బాను బాబు, తూముల లక్ష్మణరావు, దుప్పాడ పాపి నాయుడు, కిల్లారి మోహన్రావు, కొడం విజయకుమార్, కాంతారావు, ధర్మ మరియదాస్ తదితరులు ఉన్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన ఏపీవో

విశాలాంధ్ర - సీతంపేట: ఐటీడీఏ పరిధిలో గల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి సంబంధించిన పనులను పరిశీలించారు. అదే విధంగా పాఠశాల డార్మెటరీ గదులను పరిశీలించారు. విద్యార్థులకు సాయంత్రం ఇచ్చే అల్పాహారాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల హెచ్ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ అమల, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను సీజ్ చేసిన రెవెన్యూ సిబ్బంది

విశాలాంధ్ర - పాచిపెంట: మండలంలో గల గురువు నాయుడుపేటలో పాంచాలి ఒట్టిగడ్డ నుండి అక్రమంగా ఇసుక తరలించి గురువు నాయుడుపేటలో నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు మండల తహశీల్దార్ డి.రవి తెలిపారు. ఇసుకను గురు నాయుడుపేటకు చెందిన కే.పోల్ నాయుడు పాంచాల నుండి ఇసుక రవాణా చేసి గురువు నాయుడుపేటలో నిల్వ వుంచి విశాఖపట్నంకి అక్రమ రవాణా చేసినట్టు సమాచారం వచ్చిందని ఆ మేరకు ఇసుక సీజ్ చేసినట్టు తెలిపారు. సంబంధిత వ్యక్తిపై పోలీస్ కేసు పెట్టినట్లు తహశీల్దార్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పని ఆయన తెలిపారు.

విశాలాంధ్ర
అల్లూరి సీతారామరాజు
శుక్రవారం 28, ఫిబ్రవరి 2025

ఎన్నాళ్లీ డోలి మోతలు....?

- వీడని రహదారి కష్టాలు
- గర్భిణీలు, రోగుల ప్రాణాలు పోతున్నా పాలకులకు పట్టవా..!

విశాలాంధ్ర - కొయ్యూరు: ఎన్నేళ్లయినా గిరిజనులకు డోలిమోతలు తప్పడం లేదని, రహదారి పుణ్యమా అంటూ ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా వారి కష్టాలను తీర్చేందుకు కనికరించే నాధుడే కరువయ్యారని గిరిజన ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వాతంత్రం సిద్ధించి 78 ఏళ్లు పూర్తయిన గిరిజన ప్రాంతంలో అనేక మారుమూల గ్రామాలకు సరైన రహదారులు లేకపోవడంతో గర్భిణీలు వివిధ రోగాల బారిన పడిన రోగులు సమయానికి ఆసుపత్రులకు తీసుకువెళ్లలేక పోవడంతో మృత్యువాత పడుతున్న సంఘటనలు కోకోల్లలుగా సంభవిస్తూనే ఉన్నాయి. ఎన్నికల సమయంలో మాత్రం రాజకీయ పార్టీల నాయకులు డోలి మోతలు లేని సమాజంగా అభివృద్ధి చేసేందుకు తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామని గిరిజన అమాయక ప్రజానీకాన్ని నమ్మబలికి తీరా గద్దెనెక్కిన తర్వాత ఆ విషయాలను పూర్తిగా విస్మరించి వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. మళ్లీ ఎన్నికలు వచ్చినప్పుడు ఆ గిరిజన ప్రాంత ప్రజలు పడుతున్న కష్టాలపై కన్నీళ్లు కార్చడం రాజకీయ నాయకులకు పరిపాటిగా మారింది. కొయ్యూరు మండలంలో మంప పంచాయతీ గొడుగులు బంధ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అనారోగ్యానికి గురైన గిరిజనుడ్ని డోలు కట్టి మహాశివరాత్రి రోజున ఆసుపత్రికి కాలినడకన తీసుకు వెళ్ళవలసిన దయనీయ పరిస్థితులు తమకు ఉత్పన్నమయ్యాయని ఆ ప్రాంత ప్రజానీకం వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం డోలుమెతలులేని మన్యప్రాంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటనలు చేశారు. అయితే దానికి తగ్గట్టుగా ఇటీవల కాలంలో పవన్ కళ్యాణ్ మన్య ప్రాంతంలో పర్యటించి కొన్ని రహదారులు నిర్మాణానికి శంకుస్థాపనలు కూడా చేశారు. కానీ మన్య ప్రాంతంలో ఉన్న మారుమూల రహదారి లేని గిరిజన గ్రామాలు అన్నింటికీ రహదారి సౌకర్యం కల్పించి నట్లయితేనే అభివృద్ధి జరగడంతోపాటు మరణాలు సంభవించే అవకాశం తగ్గుతుందని గిరిజన ప్రజానీకం అభిప్రాయ పడుతున్నారు. వందల కోట్లు సంక్షేమం పేరుతో ఖర్చుపెట్టిన గిరిజన ప్రాంతం ఎన్నటికీ అభివృద్ధి చెందదని రహదారి నిర్మాణాలు చేపట్టడంతోనే గిరిజన ప్రజల్లో అభివృద్ధి చాయలు కనిపిస్తాయని మరికొందరు తెలుపుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర కూటమి ప్రభుత్వం అధికారులు స్పందించి మారుమూల ప్రాంతాల్లో రహదారి సౌకర్యం లేక నిత్యం అష్టకష్టాలు పడుతున్న గిరిజనుల కష్టాలను తీర్చాలని రహదారి సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర - హుకుంపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో గురువారం ఎన్నికల పోలింగ్ జరిగింది. ఈ పోలింగ్ కేంద్రాలను అల్లూరి జిల్లా ఎస్పి అమిత్ బర్దర్, డీఎస్పీ సహబాజ్ అహ్మద్ సందర్శించి పరి శీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పగడ్బందీ చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఎస్పీ ఆదేశించారు. మండలంలో 91 శాతం ఓటింగ్ నమోదు అయింది. 124 ఓట్లకు గాను 113 మంది ఓటు హక్కును వినియో గించుకున్నారు. స్థానిక ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సురేష్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలపై ఆరోపణలు రావడం బాధాకరం

గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రజిని

విశాలాంధ్ర - చింతపల్లి: స్థానిక ఏకలవ్య పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికై విచారణ జరిపేందుకు రావడం జరిగిందని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజిని అన్నారు. స్థానిక ఏటీడబ్ల్యూఓ నాగ జయలక్ష్మితో కలసి ఆమె ఏకలవ్య ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులతోనూ, అదే క్రమంలో ఉపాధ్యాయులపై ఆరోపణలు వచ్చిన 8వ తరగతి విద్యార్థిని, విద్యార్థుల తోనూ వేరువేరుగా విచారణ జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కఠినంగా దండించారని పత్రికలలో వస్తున్న కథనాలపై ఆరా తీశారు. ముందుగా విద్యార్థిని, విద్యార్థులతో కలసి వసతి గృహంలో సహపంక్తి భోజనం చేశారు. తప్పు చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోనని విద్యార్థులకు ఆమె భరోసా కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాలను ఏజెన్సీలో ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఇటువంటి కార్పొరేట్ తరహా సేవలు ఉన్న విద్యా సంస్థలో ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కావడం మంచిది కాదన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల పట్ల బేదాభిప్రాయాలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదని అటు ఉపాధ్యా యులకు, ఇటు విద్యార్థిని, విద్యార్థులకు ఆమె సూచించారు. అప్పుడప్పుడు తల్లిదం డ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థినీ, విద్యార్థుల ప్రవర్తనల పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు ఆమె సూచించారు. సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి నివేదిక పంపిస్తానని ఆమె తెలిపారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

విశాలాంధ్ర - కొయ్యూరు: గత కొన్నాళ్లుగా నిరుపయోగంలో ఉన్న సంపద తయారీ కేంద్రాలను తక్షణమే వినియోగంలోకి తెచ్చేందుకు సచివాలయం సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఎస్‌కెవి ప్రసాద్ ఆదేశించారు. కొయ్యూరు మండలం రత్నంపేట, రావణపల్లి గ్రామాలలో సందర్శించి అసంపూర్తిగా ఉన్న సంపద కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. నిరుపయోగంగా పడి ఉన్న సంపద షెడ్లు పూర్తికి తగిన ప్రతిపాదనలను పంపించాలని ఎంపీడీవో ఆదేశించారు. గ్రామాల్లో పేరుకుపోతున్న తడి పొడి చెత్తలను నిల్వ చేసేందుకు ఉపయోగపడే విధంగా ఆయా కేంద్రాలను వారం లోగా వినియోగంలోకి తేవాలని ఎంపీడీవో ప్రసాద్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రజనీ, తలుపులు నాయుడు, సింహాచలం ఇంజనీరింగ్ అధికార్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలింగ్

విశాలాంధ్ర- జీకే వీధి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జీకే వీధి పోలింగ్ స్టేషన్ నెంబర్ 88లో 123 మంది ఓటర్లలో

104 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 54, స్త్రీలు 50 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. తహశీల్దార్ పోలింగ్ కేంద్రం వద్ద ఉండి పోలింగ్ సరళిని పరిశీలించారు. సెక్టర్ ఆఫీసర్ బాబు, జీకే విధి ఎస్ఐ అప్పలసూరి, రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఎన్నికల్లో పాల్గొన్నారు.

మహేశ్వరరావు సేవలు ఎనలేనివి

ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిరా ప్రియాంక

విశాలాంధ్ర - చింతపల్లి: పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ఉద్యోగ విరమణ చేసి మొట్టమొదటిసారిగా చింతపల్లి ఏరియా ఆసుపత్రికి వచ్చిన విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరావు దంపతులను ఆసుపత్రి వైద్యులు సహా సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సత్కార కార్యక్రమంలో గతంలో ఈ ఆసుపత్రి సూపరిండెంటెంట్‌గా మహేశ్వరరావు అందించిన సేవలను ఈ సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బంది కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డిడిఓ చంద్రశేఖర్, డాక్టర్ రుక్మిణి, డాక్టర్ భారతి, డాక్టర్ రమేష్, డాక్టర్ లావణ్య, ఫార్మసీ సూపర్వైజర్ సాంబయ్య, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్ కుమార్, ఫార్మసిస్ట్ గౌరీ శంకర్, ఎస్ఓ రాజారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ అభ్యర్థి గెలుపు ఖాయం

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్న

రఘువర్మ గెలుపు ఖాయమని టిడిపి రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి సన్యాసిరావు, విజయనగరం ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర అన్నారు. మండల కేంద్రంలో టిడిపి శ్రేణులు, ఏపీటీఎఫ్ నాయకులు ఏర్పాటు చేసిన శిబిరాన్ని వారు సందర్శించారు. ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రఘువర్మ కృషి చేస్తున్నారని, ఆయన గెలుపుతో ప్రభుత్వం అండగా ఉంటుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామారావు, టిడిపి నాయకులు, ఏపీటీఎఫ్ నాయకులు తదితరలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పాదనలో రికార్డు సాధించిన అప్పర్ సీలేరు హౌస్

విశాలాంధ్ర - సీలేరు: విద్యుత్ ఉత్పాదనలో తన రికార్డులను తానే తిరగరాసుకుంటూ అప్పర్ సీలేరు పవర్ హౌస్ (యుఎస్‌పిహెచ్) మరో ఘనతను సాధించింది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రాజేంద్రప్రసాద్ సారధ్యంలో యుఎస్‌పిహెచ్ ఒక రోజు 4.949ఎంయు ఉత్పత్తి చేసి ఆల్ టైం హైరికార్డు సాధిం చడంతో పాటు ఎఫ్‌వై 2024-2025 సిఇఎ విద్యుత్ ఉత్పాదక టార్గెట్ 47 ఎంయులను 26.02.2025(ఐసీ 477,644ఎంయు) న ఒక నెల ముందుగానే అధిగమించింది. ఛీఫ్ ఇంజనీర్, ఓఅండ్ఎం జీఎం వాసుదేవరావు, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఓ అండ్ ఎం డి.చిన కామేశ్వరరావు, సివిల్ ఎస్ఈ బిచంద్ర శేఖర్‌రెడ్డి సహకారంతో ఈ ఘనత సాధించా మన్నారు. ఈ ఘనత సాధించడంలో ప్రతీ ఒక్క ఇంజనీర్ ఉద్యోగి, కార్మికుడు పాత్ర ఉందని, భవిష్యత్‌లో అందరం కష్టపడి సంస్థకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జేసీ

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండల కేంద్రంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ గురువారం సందర్శించారు. పోలింగ్ సరళిని ఎన్నికల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సజావుగా పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో 93శాతం పోలింగ్

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: డుంబ్రిగుడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం జరిగిన పోలింగ్ 93 శాతం నమోదయింది. 76మంది ఓటర్లకుగాను 71మంది ఓటును వినియోగించుకున్నారు. 51 మంది ఉపాధ్యాయులు, 20 మంది ఉపాధ్యాయినిలు ఓటును వినియోగించుకున్నారు. ఎన్నికలకు స్థానిక ఎస్సై పాపినాయుడు నేతృత్వంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

శివుని ఆశీస్సులు ప్రతిఒక్కరిపై ఉండాలి

విశాలాంధ్ర - చింతపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్పిఎఫ్) అసిస్టెంట్ కమాండెంట్ డి.వినీత ఆధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వందల సంఖ్యలో భక్తులు విచ్చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అసిస్టెంట్ కమాండెంట్ వినీత స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందువులు ఆచరించే ముఖ్యమైన పర్వదినం మహాశివరాత్రి అన్నారు. శివపార్వతుల వివాహం జరిగిన రోజుగా, శివుడు తాండవం చేసిన రోజు శివరాత్రి అన్నారు. ఇటువంటి పర్వదినాన్ని పురస్కరించుకొని అన్నసంతర్పణ కార్యక్రమం

నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వందలాది మది భక్తులతో పాటు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 93.74 ఓటింగ్ నమోదు

విశాలాంధ్ర - పార్వతీపురం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 93.74శాతం ఓటింగ్ నమోదైనట్లు జిల్లా అధికారులు తెలిపారు. జిల్లాలో 2వేల 333 మంది ఉపాధ్యాయులకుగాను 2వేల 187మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఏఆర్ఓ అయిన జిల్లా రెవెన్యూ అధికారి హేమలతలు తెలిపారు. వీరిలో 1469 మంది పురుషులుకాగా, 718 మంది మహిళలున్నారని తెలిపారు. పాలకొండ నియోజకవర్గంలో వీరఘట్టంమండలంలో 117/ 120మంది, సీతంపేట మండలంలో 116/ 121 మంది, భామిని మండలంలో 42/ 44మంది, పాలకొండ మండలంలో 243/ 301మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కురుపాం నియోజకవర్గంలో కొమరాడలో 63/ 65మంది, గుమ్మలక్ష్మీపురంలో 183/ 189మంది, కురుపాంలో 112/ 120మంది, జియ్యమ్మ వలసలో 78/ 91మంది, గరుగుబిల్లిలో 95/ 105మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో పార్వతీపురం మండలంలో 591/ 636మంది, సీతానగరంలో 111/ 114మంది, బలిజిపేటలో 81/ 88మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాలూరు నియోజకవర్గంలో సాలూరులో 228/ 250మంది, మక్కువలో 55/55 మంది, పాచిపెంటలో 32/ 34మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో శతశాతం ఓటు హక్కును మక్కులో వినియోగిం చుకోగా, తక్కువగా జిఎం.వలస మండలంలో (85శాతం) నమోదయింది. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పగడ్బందీగా చేపట్టిందని, 15 మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సజావుగా ఎన్నికలు జరిగేందుకు అంతా సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా రెవెన్యూ అధికారి హేమలతలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - పార్వతీపురం/ పార్వతిపురం టౌన్, బెలగాం/గరుగుబిల్లి: జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పార్వతీపురం పట్టణంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల, గరుగుబిల్లిలో జిల్లా పరిషత్ స్కూల్‌లో గల పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఉపాధ్యాయులు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు గురువారం పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాలలో జరుగుతున్న నేపథ్యంలో ఎస్పీ సుడిగాలి పర్యటన చేస్తూ పలు పోలింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. క్యూలైనులు, ఎన్నికల తీరును, భద్రత చర్యలను పర్యవేక్షించారు. ఎన్ని కల నియమ నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని, ఓటర్లు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి పోలింగ్ కేంద్రంలోకి పంపాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు, నిషేధిత వస్తువులు అనుమతించవద్దని జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీచేసి, పలు భద్రతాపరమైన సూచనలు చేశారు. జిల్లాలో మొత్తం 301 మంది పోలీసులు ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో

ఉందన్నారు. పార్వతీపురం సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత సురాన, పాలకొండ డిఎస్పి రాంబాబులు కూడా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

లక్ష్మీనరసింహస్వామి ముడుపుల పూజలకు తరలివచ్చిన భక్తులు

విశాలాంధ్ర - సీతానగరం: శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం జరిగిన ముడుపుల పూజలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ముడుపుల పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేకువజాము నుండి రాత్రి వరకు ముడుపుల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు వీసపాటి శ్రీనివాసాచార్యులు, వీసపాటి రామానుజాచార్యులు తెలిపారు. బ్యాచుల వారీగా ఈ పూజలను నిర్వహించడంతోపాటు భక్తులు తెచ్చిన వివిధ రకాల పూలదండలు, పూలతో స్వామివారిని పెద్దఎత్తున అలంకరించారు. ప్రతీ గురువారం శ్రీలక్ష్మి నరసింహస్వామీ దేవాలయంలోజరుగుతున్న ముడుపుల పూజలకు పాతభక్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి కొత్త భక్తులు రాకతో అనూహ్య స్పందన వస్తుందని తోటి భక్తులు తెలిపారు. ముడుపుల పూజలలో జిల్లా కలెక్టర్ సతీమణి, పలువురు జిల్లా, మండల అధికారులు, ఆలయ ధర్మకర్త చెలికాని వెంకటగోపాలకృష్ణ భారతి దంపతులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ ప్రధానఅర్చకులతో పాటు పవన్ ఆచార్యులు, మురారి, కృష్ణమోహన్ ఆచార్యులు, టీటీడీ దివ్య ప్రచారకులు కె శ్రీనివాసరావులు దగ్గరుండి పూజలు చేయించడంతోపాటు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలవరం ముంపు బాధితులను పట్టించుకోరా..?

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న ముంపు బాధితులతో అధికారులు చెలగాటం ఆడుతున్నారని, నిర్వాసితులకు అన్యాయం చేస్తారా..? అంటూ వైస్ ఎంపీపీ ముత్యాల భవాని, సోడే నరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. పోలవరం ముంపులో ఉన్న బాధితులు పనులు లేక పనుల కోసం తలో దారి పోతూ ఉంటే వాళ్ల పేర్లను తొలగించి వాళ్ల పొట్ట కొట్టాలని చూస్తున్నారని విఆర్ పురంలో కొంతమందికే పరిహారం వచ్చేలా జాబితా తయారు చేయడం బాధాకరమని, ముంపులో ఉన్న ప్రతి నిర్వాసితులు కుటుంబ సభ్యులు నిర్వాసితులేనని అధికారులకు తెలియదా అని స్థానిక అధికారులు అక్కసుతో చేశారనిపిస్తుందని అన్నారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ జాబితాలో ప్యాకేజీ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వలన కొందరి పేర్లు జాబితాలో చేరకపోవడం అన్ని సర్వేలలో అందరి పేర్లు ఉన్నప్పుడు ఈ గ్రామసభ జాబితాలో కొందరి పేర్లు ఎందుకు లేవు అని, అందరి పేర్లు లేకుండా గ్రామసభ నిర్వహిస్తే ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

విశాలాంధ్ర - గంగవరం: జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి వంద రోజులు పని దినాలు కల్పించకపోతే సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ఏపీవో ప్రకాష్ సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన ఉపాధి హామీ సిబ్బందితో వారాంతపు సమీక్ష నిర్వహించారు. 60 రోజులు పూర్తి చేసుకున్న అన్ని జాబ్ కార్డు దారులు 100 రోజులు పూర్తి చేసుకునేలా అవగాహన వరచి పనులకు వచ్చేలా చూడాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద డ్రోన్లు ఏర్పాటు

విశాలాంధ్ర - పార్వతీపురం/ సీతానగరం: జిల్లాలో 15 మండలాల్లో గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగగా పార్వతీపురం సబ్ డివిజన్ పరిధిలో ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగిందని సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత సురాన తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును ఏర్పాటు చేసామన్నారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలను డ్రోన్ల కెమెరాలతో కూడా చిత్రీకరించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రంలో సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను గూర్చి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసన్నకుమార్, సీతానగరం పార్వతీపురం ఎస్సైలు రాజేష్, సంతోష్ కుమారిలు, పోలీస్ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గొయ్యిలో పడి గిరిజన మహిళకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - కొయ్యూరు: మండలంలో సుదూర ప్రాంతంలో ఉన్న యూ. చీడిపాలెం పంచాయతీ గంగవరం గ్రామానికి చెందిన గిరిజన మహిళ కే.మంగ్లీ (60) ఇంటి వద్ద గొయ్యిలో పడి తీవ్ర గాయాలు పాలయ్యింది. దీంతో గాయపడిన మంగ్లీని స్థానికుల సహకారంతో 108 సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె ఇంటి ఆవరణలో తీసిన ఇంటి పునాది గోతిలో అదుపుతప్పి పడిపోయిందని తెలిపారు. మెరుగైన వైద్యం నిమిత్తం అడ్డతీగల నుండి108 సిబ్బంది నవాజ్, లక్ష్మిలు వై.రామవరం ఆసుపత్రికి తరలించారు.

శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో పటిష్ట చర్యలు

విశాలాంధ్ర - చింతపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు చేపట్టారు. అల్లూరి జిల్లా ఎస్ పి అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు చింతపల్లి ఏ ఎస్ పి నవజ్యోతి మిశ్రా, సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినీతల పర్యవేక్షణలో స్థానిక సి ఐ ఎం వినోద్ బాబు, ఎస్ ఐ. వి వెంకటేశ్వర రావుల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు సివిల్ అండ్ సిఆర్పిఎఫ్ పోలీస్ లు పోలింగ్ సజావుగా సాగేందుకు పటిష్ట భద్రత నిర్వహించారు. పోలింగ్ సరళిని అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ రెడ్డి సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఫర్నిచర్ సమస్యతో పరీక్షా కేంద్రం ఎత్తివేయడం తగునా...?

విశాలాంధ్ర - సీతానగరం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 35 ఏళ్లుగా లేని ఫర్నిచర్ సమస్య ఇప్పుడు రావడమేంటని, పరీక్షా కేంద్రాన్ని ఫర్నిచర్ పేరుతో ఎత్తివేయడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు, విద్యా కమిటీ చైర్మన్, విద్యార్థిని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. మొదట్లో 1983లో సెంటరు ఏర్పాటు చేసిన సమయంలో నేలపై ఇసుకలో కూర్చుని పరీక్ష రాసామని పలువురు పెద్దలు తెలిపారు. చాలా ఏళ్ళు నేలపై కూర్చొని పరీక్షలు రాయగా, గత పదేళ్లుగా బెంచీలపై కూర్చొని పరీక్షలు రాస్తున్నారు. మండల కేంద్రంలో ఇక్కడ పరీక్షా కేంద్రాన్ని ఎత్తివేసి జోగంపేటలో గురుకులంలో ఏర్పాటు చేయడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉండగా మూడు క్లస్టర్లుగా ఏర్పాటు చేయగా అందులో సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకటి కావడం గమనార్హం. క్లస్టర్‌కు అర్హత సాధించిన ఈ పాఠశాల పరీక్షా కేంద్రానికి అర్హత లేకపోవడంలో ఆంతర్యం ఏమిటని వారంతా ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు లేకపోయినప్పటికీ వాటిని పరీక్షల సమయంలో తెప్పించేందుకు కొంత బడ్జెట్‌ను కూడా కేటాయిస్తారు. పదో తరగతి పరీక్షలు జంబ్లింగ్ తరహాలో జరుగుతున్న ఒక్కసారిగా మండల కేంద్రంలో ఉండే పరీక్ష కేంద్రాన్ని ఎత్తివేయడంతోనే తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇన్నేళ్లుగా నడుస్తున్న ఈ పరీక్షా కేంద్రాన్ని ఇప్పుడు ఎత్తివేయడాన్ని మండల ప్రజలు, తల్లిదండ్రులు, నాయకులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థిని విద్యార్థులు సమంజసమేనా అని

ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా దీనిపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని పునరాలోచించి యధావిధిగా పరీక్షా కేంద్రం ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

విశాలాంధ్ర - గంగవరం: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని తహశీల్దార్ సిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలో మొత్తం పట్టభద్రులు 326 మందికి గాను 256 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ఇందులో 154 మంది పురుషులు, 102 మంది స్త్రీలు ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆయన అన్నారు. పోలింగ్ నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వై.రామవరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో గురువారం వై.రామవరం మండలంలో 80శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల సహాయ అధికారి(ఎ ఇ ఆర్ ఓ) తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. పోలింగ్ సరళిని ఆయన పరిశీలించారు. మండల దిగువ పరిదిలో 185 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లుకు 148 మంది ఓట్లు వేశారన్నారు. మండల ఎగువ పరిది డొంక రాయిలో 25 మందికి నూరు శాతం పోలింగ్ జరిగినట్లు సెక్టోరియల్ అధికారి ఎంఇఓ తతబ్బాయి దొర తెలిపారు. పోలింగ్ నిర్వహణలో పీవో ఆర్.వెంకట సత్యనారాయణ, ఏపీవో కె.కృపావరం, ఓపీఓలు భార్గవ్ చరణ్, విఘ్నేష్‌లు పాల్గొన్నారు. సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణ బందోబస్తు నిర్వహించారు.

మక్కువ: మండలంలో జిల్లా ఉన్నత పాఠశాల టెన్త్ బి సెక్షన్ రూమ్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. మక్కువ మండలంలో పోలింగ్ కేంద్రంలో 55 ఓటర్లు నమోదు కాగా 55 మంది హాజరై శాతం ఓట్లు వేశారు. పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు తహశీల్దార్ షేక్ ఇబ్రహీం తెలిపారు.

దేవీపట్నం: దేవీపట్నం మండలం ఇందుకూరుపేట జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ పిఎస్ నెంబర్ 12 పోలింగ్ కేంద్రంలో పట్టభద్రుల (గ్రాడ్యుట్స్ ఎమ్మెల్సీ ఓటింగ్ శాతం 75.34 నమోదవడం జరిగిందని తహసీల్దార్ కె.సత్యనారాయణ తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి నాలుగు గంటల వరకు జరిగిన పోలింగ్ లో 430 మంది ఓటర్లకు గాను 324 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని దీనిలో 190 పురుషులు, 134 మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగిందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై కే షరీఫ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు పటిష్టంగా నిర్వహించడం జరిగిందన్నారు. మొత్తం ఓటింగ్ 324 మంది తమ ఓటు హక్కు ను వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి సురేష్ తెలియజేశారు. పటిష్టమైన పోలీసు భద్రత మధ్య సీలు వేసిన ఓటింగ్ బాక్సులను ఎన్నికల పర్యవేక్షణ అధికారి సిడిపిఓ, డి.సంధ్యారాణి, ఎస్ఐ కే షరీఫ్ ఎన్నికల అధికారి సురేష్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులో రంపచోడవరం తరలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డిఎన్ రత్నకుమారి, వీఆర్వో ఉదయ్ కాంత్, మండల రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట: బలిజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ ఎన్నికలు ప్రశాంతంగా పగడ్బందీగా జరిగాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బ్లాకు పిఎస్ నెంబర్ 48 ఎన్నికలు జరిగాయి. మొత్తం ఓట్లు సంఖ్య 88 కాగా 81 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ఆవరణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బలిజిపేట స్థానిక ఎస్సై సింహాచలం, తమ సిబ్బంది పగడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

రాజవొమ్మంగి: ఎమ్మెల్యే శిరీషా దేవి సొంత మండలమైన రాజవొమ్మంగిలో గురువారం తన ఎమ్మెల్సీ ఓటును వినియోగించుకున్నారు. అలాగే మండలానికి చెందిన చాలా మంది పట్టభద్రులందరు తమ ఓటును వినియోంచుకున్నారు. తహసిల్దార్ అల్లు సత్యనారాయణ పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలానికి సంబంధించి 670 ఓటర్లు ఉండగా 505 ఓట్లు నమోదు అయినట్లు తెలిపారు. పురుషులు 333మంది, మహిళలు172 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని, 75.37 శాతం పోలింగ్ అయిందని ఎన్నికల అధికారి చక్రధరరావు తెలిపారు. కార్యక్రమంలో పోలింగ్ సెక్టార్ అధికారి తూము సూరయ్య రెడ్డి, రూటు ఆఫీసర్ ప్రదీఫ్ కుమార్ పాల్గొన్నారు.

చింతపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల పోలింగ్ గురువారం చింతపల్లిలో ప్రశాంతంగా జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ఉపాధ్యాయ శాసనమండలికి పది మంది బరిలో ఉన్నప్పటికీ ఈ ప్రాంతానికి సంబంధించి ఏపీటీఎఫ్ నుంచి కూటమి పార్టీలు బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మ, పి ఆర్ టి యు నుంచి గాదె శ్రీనివాసులు నాయుడు, అదే క్రమంలో ప్రోగ్రెసివ్

డెమొక్రటిక్ ఫ్రంట్ నుంచి కోరెడ్ల విజయ గౌరీలు బరిలో ఉన్నారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసారు. దీంతో గురువారం ఉదయం 8 గంటలు నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభం అయింది.. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయమే పోలింగ్ కేంద్రానికి చేరుకొని తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. చింతపల్లి మండలంలో 188, గూడెం కొత్త వీధి మండలం లో 123, కొయ్యూరు మండలంలో 161 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు అయి ఉన్నారు. ఈ కార్యక్రమాలలో పాకలపాటి రఘు వర్మకు మద్దతుగా తెలుగుదేశం పార్టీకి చెందిన అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి, తెదేపా మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, తమ్మంగుల ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, సీనియర్ నాయకులు లక్ష్మణరావు, బేతాళుడు, చెన్న కేశవ నాయుడు, కేసు బాబు, యశ్వంత్, మహేంద్ర, అనిల్, మధు, భీమన్న,, ఏ పీ టి యు కి చెందిన ఉపాధ్యాయులు, అదేవిధంగా గాదే శ్రీనివాసులు నాయుడు కు మద్దతుగా పి ఆర్ టి యు కు చెందిన ఉపాధ్యాయులు, పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరీ కి మద్దతుగా బోనంగి చిన్నయ్య పడాల్, పాంగి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: తూర్పు, పశ్చిమగోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు ప్రతిష్టాత్మకమైన పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతమైన వాతావరణంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని

రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ చింతూరు డివిజన్, రంపచోడవరం డివిజన్లో 12 పోలింగ్ స్టేషన్లలో ప్రశాంతంగా శాసనమండలి ఎన్నికలు నిర్వహించడం జరిగిందని అదేవిధంగా 77.90 శాతం పోలింగ్ జరిగిందని ఆమె తెలిపారు. సబ్ కలెక్టరు వెంట రంపచోడవరం తాసిల్దార్ రామకృష్ణ ఎంపీడీవో యస్. శ్రీనివాసరావు దొర, సిడిపిఓ సంధ్యారాణి, డిప్యూటీ తాసిల్దార్లు సత్యనారాయణ, జిలాని, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సిహెచ్ నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలో

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ బూత్ నాలుగులో మొత్తం ఓటర్లు 328 కాగా పురుషులు 202, స్త్రీలు 87 మంది ఓటును సద్వినియోగపరుచుకున్నారు. మొత్తం పోలింగ్ 88.10% నమోదయింది. స్థానిక ఎస్సై సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

పాలకొండ/వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గ పరిధిలో వీరఘట్టం పాలకొండలో ఎమ్మెల్సీ ఎన్నికలు పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. వీరఘట్టం మండల

పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఓటర్లు సంఖ్య 120 మంది ఓటర్లు ఉండగా పురుషులు 81 ఓట్లను వినియోగించుకున్నారు. మహిళలు 36 ఓట్లు ఉండగా 36 మంది కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే పాలకొండ మండల పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 301కి గాను పురుషులు 178 మంది ఓట్లు వినియోగించుకోగా స్త్రీలు 105 మంది వినియోగించుకున్నారు. అలాగే సీతంపేటలో 116 మంది ఓటు హక్కును వినియోగించుకోగా భామినిలో 42 మంది అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలలో సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి తనిఖీలను నిర్వహించారు. ఏ విధమైనటువంటి సంఘటనలు జరగకుండా డి.ఎస్.పి ఎం రాంబాబు, సిఐ ఎం.చంద్రమౌళి. ఎస్సై ప్రయోగ మూర్తి ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు నిర్వహించారు. మొత్తంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

విశాలాంధ్ర - ఎటపాక: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రక్రియ గురువారం ఎటపాక మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ఎటపాక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో మండలంలో పురుషులు 235, స్త్రీలు 151 మంది మొత్తం ఓట 386 మందిలో ఉండగా వారిలో పురుషులు 176 మంది, స్త్రీలు 97 మంది మొత్తం 273 మంది ఓటును వినియోగించుకున్నారని ఆర్ వెంకటేశ్వరరా ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం పోలింగ్ 70 73 శాతం నమోదైంది.

జిల్లాకు చేరిన పోలింగ్ బ్యాలెట్ బాక్సులు

విశాలాంధ్ర - పార్వతీపురం /పార్వతీపురం టౌన్: గురువారంనాడు జిల్లాలో 15 మండల కేంద్రాల్లో జరిగిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తికాగా పటిష్ట బందోబస్తు మధ్య బ్యాలెట్ బాక్సులను జిల్లా కేంద్రానికి తీసుకుని వచ్చారు. వాటిని జిల్లా అధికారులు దగ్గరుండి రిసీవ్ చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవలు పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా పూర్తికావడంతో ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలోని 15 మండల కేంద్రాల నుండి జిల్లాకు వచ్చిన 30 బ్యాలెట్ బాక్సులను పటిష్ట పోలీస్ బందోబస్తుతో విశాఖపట్నం కౌంటింగ్ కేంద్రానికి తరలించారు.

పోలింగ్ బూత్‌ను పరిశీలించిన రఘువర్మ

విశాలాంధ్ర - పార్వతీపురం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏపీటిఎఫ్ నుండి పోటీచేసి కూటమి మద్దతు పలికిన రఘువర్మ గురువారం నాడు పార్వతీపురం పట్టణంలోని 45వ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ తీరును పరిశీలించి ఎన్ని ఓట్లు వేశారన్నది ఆరా తీసారు. అనంతరం పోలింగ్ ఆరు బయట మద్దతుదారులు వద్దకు వెళ్లి మాట్లాడారు. విజయంపై ధీమానువ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు, టిడిపి జనసేన నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతి పరమేశ్వరుల కళ్యాణం

విశాలాంధ్ర - ఎటపాక: ఎటపాక మండలం గన్నవరం కాలీ కార్తికేయ శివాలయంలో వైభవంగా పార్వతి పరమేశ్వరుల కళ్యాణం బుదవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. గణపతి పూజా, ధ్వజారోహణం, ఎదుర్కోళ్ల అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధికంగా పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

అలమండ సచివాలయం ఆకస్మిక సందర్శన

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలో గల అలమండ సచివాలయాన్ని గురువారం మండల అభివృద్ధి అధికారి శంబంగి రమేష్ ఆకస్మికంగా సందర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పలు చేపడుతున్న పలు సర్వేలపై ఆయన ఆరా తీశారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకాన్ని పంపిణీ చేసే సమయంలో పింఛనుదారులతో వ్యవహరించే తీరుపై జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఆయన కొన్ని సూచనలు సలహాలు సిబ్బందికి ఇవ్వడం జరిగినది. ఉదయం 6 గంటల నుంచి పంపిణీ కాకుండా 7 గంటల నుంచి ప్రారంభించాలని ఆయన సచివాలయ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అప్పన్నదొరవలసలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించడం జరిగినది.

కూటమి అభ్యర్థి వర్మ గెలుపు తథ్యం

విశాలాంధ్ర - పార్వతీపురం/ పార్వతీపురం టౌన్/బెలగాం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏపీటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాల మద్దతుతోపాటు కూటమి ప్రభుత్వం మద్దతు తెలియజేసిన పాకలపాటి రఘువర్మ గెలుపు తథ్యమని ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. గురువారం నాడు పార్వతీపురం సీతానగరం, బలిజిపేట మండల కేంద్రాలు పోలింగ్ కేంద్రాలకు దగ్గరలో నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఏర్పాటుచేసిన టెంటుల వద్దకు వెళ్లి ఓటర్లయిన ఉపాధ్యాయులకు స్లిప్పులు అందజేసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. గతవారం రోజులుగా ఉపాధ్యాయ సంఘ నాయకులతో పాటు టిడిపి నాయకులు నిరంతరం కష్టపడి పనిచేశారని, ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారన్నారు. కచ్చితంగా విజయం సాధిస్తామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నుండి ఎన్నికలకు విచ్చేసిన ఆయన గురువారం సాయంత్రం తిరిగి వెళుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కష్టపడిన నాయకులు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతానగరం, పార్వతీపురం ,పార్వతీపురం పట్టణం, బలిజిపేట మండలాలకుచెందిన అధ్యక్ష, కార్యదర్శులు,ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చింతూరులో ఎమ్మెల్సీ ఎన్నికలు

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఏజన్సీలో యం యల్ సి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది, నాలుగు మండలాల వ్యాప్తంగా 1560ఓటర్లు ఉండగా సుమారు 1230 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అల్లూరి జిల్లా నాలుగు విలీన మండలాల్లోని ఎటపాక మండలంలో 386 మంది ఓటర్లు ఉండగా 273 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు, కూనవరం మండలంలో 458 ఓటర్లు ఉండగా 357 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు,చింతూరు మండలంలో 388 మంది ఓటర్లు ఉండగా 311 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు,వి.ఆర్ పురం మండలంలో 328 మంది ఓటర్లు ఉండగా 289 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు, నాలుగు మండలాల వ్యాప్తంగా 1560 మంది ఓటర్లకు గాను 1230 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

డిప్లోస్ మాక్స్‌ను విడుదల చేసిన న్యూమెరస్ మోటర్స్

విశాలాంధ్ర - పాడేరు: స్వదేశీ ఎలక్ట్రిక్ వాహనాలలో ప్రత్యేకత కలిగిన నవీన తరపు ఒరిజినల్ పరికరాల తయారీదారు న్యూమెరస్ మోటర్స్, ఈరోజు హైదరాబాద్‌లో తమ మల్టీయుటిలిటీ ఇ-స్కూటర్, డిప్లోస్ మాక్స్‌ను పరిచయం చేసింది. క్లీన్ మొబిలిటీని పునర్నిర్వచించడానికి రూపొందించబడిన డిప్లోస్ మాక్స్, దాని ప్రతిష్టాత్మక డిప్లోస్ ప్లాట్ఫారం కింద విభిన్న వినియోగాలకు అనుగుణంగా వ్యక్తిగత మొబిలిటీ విభాగంలోకి కంపెనీ ప్రవేశాన్ని సూచిస్తుంది. ఈ వాహనాలు భద్రత, విశ్వసనీయత మరియు మన్నిక సూత్రాలను కలిగి ఉంటాయి, ఇవి వివిధ రకాల వినియోగదారుల అవసరాలకు అనువైనవిగా చేస్తాయి. డిప్లోస్ మాక్స్ హైదరాబాద్‌లో రూ.1,12,199 ఎక్స్-షోరూమ్ ధరకు అందుబాటులో ఉంది. కంపెనీ ఈ వాహనం కోసం భారతదేశంలోనే అతిపెద్ద పైలట్ పరీక్షను నిర్వహించింది, ఇది 13.9 మిలియన్ కిలోమీటర్లకు పైగా ప్రయాణించింది.

కురుపాంలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

విశాలాంధ్ర - కురుపాం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కురుపాంలో ప్రశాంతంగా ముగిసింది. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం కురుపాం జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియ ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభించి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించారు. మండలంలో 120 మంది ఓటర్లు ఉండగా 112 మంది ఓటుహక్కును వినియోవించుకున్నారు. పురుషులు 84 మందికి 81 మంది, మహిళలు 36 మందికి 31 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఏ ఆర్ డి ఎస్ పి ఎల్.శేషాద్రి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఎల్విన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.హరి, స్థానిక ఎస్సై పి. నారాయణరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

వెంకటరాజపురం సుభద్రమ్మ వలస గ్రామాల మధ్య ఏనుగుల హల్ చల్

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలోని పంటలపై ఏనుగుల విధ్వంసం కొనసాగుతూనేవుంది. వివరాలలోకి వెళ్తే గత మూడు రోజులుగా పెదమేరంగి కూడలికి ఆనుకుని ఉన్న జొన్న చేలు వరి నారు మళ్ళలోని తిష్టవేసిన ఏనుగుల గుంపు గురువారం ఉదయం నుంచి గవరంపేట, కన్నపుదొర వలస పంచాయతీ పరిధిలో గల వెంకటరాజపురం సుభద్రమ్మవలస గ్రామాల రైతులు మరడాన తిరుమల రావు, మరడాన మధు, మల్లిమ కృష్ణమూర్తి తదితర రైతులు చేసిన జొన్నచేను వరి నారు మడులను ధ్వంసం చేశాయి. ధ్వంసం చేసిన పంటను చూసి తీవ్ర ఆందోళన చెందుతున్న రైతులు ఏనుగుల గుంపును ఇక్కడి నుండి తరలించాలని నష్టపోయిన పంటకు నష్ట పరిహారం చెల్లించాలని అధికారులను ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేస్తున్నారు.

మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండల కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 90 మంది ఓటర్లకు గాను 78 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఎల్విన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. హరి ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్ చినమేరంగి ఎస్సై పి. అనిష్ పోలీస్ సిబ్బందితో పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ తీరును అరకు పార్లమెంటరీ పార్టీ నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉండగా తమ అభ్యర్థిని గెలిపించుకునేందుకు ఎపిటిఎఫ్ మండల ప్రెసిడెంట్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు పూర్వ అధ్యక్షులు ఎర్రా శంకరరావు గుంట్రెడ్డి సత్యనారాయణ డి. వేణుగోపాలరావు, మరిశర్ల రామారావు మండల ఎపిటిఎఫ్ నాయకులు సాయిశక్తుల కృషి చేశారు. ఏది ఏమైనా పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రేపటి నుండే ఇంటర్మీడియట్ పరీక్షలు

ప్రణాళిక ద్వారానే సత్ఫలితాలు సాధ్యం విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

విశాలాంధ్ర - చింతపల్లి: రేపటి (మార్చి ఒకటి) నుండి జరగబోవు ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థులు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకున్నట్లయితే సత్ఫ లితాలు సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పరీక్షలు అంటేనే విద్యార్థుల్లోనూ, వారి తల్లిదండ్రుల్లోనూ ఒక రకమైన ఒత్తిడి పెరుగుతుంది. దీనిని అధిగమించాలంటే విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ఏదైనా సాధించగలమనే ఆత్మ విశ్వాసంతో ఆ దిశగా అభ్యసిస్తే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం సునాయాసం అవుతుంది. ప్రతి ఏటా మార్చి, ఏప్రిల్ నెలలు వస్తున్నాయంటే ఎవరికైనా ముందుగా గుర్తొచ్చేవి వార్షిక పరీక్షలు. ఈ పరీక్షల్లో సత్ఫలితాలు సాధించాలని లక్ష్యంతో ముందుకు వెళుతున్నప్పటికీ విద్యార్థుల్లో గుబులు మొదలవుతుంది. ఆ గుబులను అధిగమించి విద్యనభ్యసిస్తే సత్ఫలితాలు సాధించడం సులభతరం అవుతుంది. చదువుతున్న సమయంలో కొంతసేపు విరామం తీసుకోవడం, గత పరీక్షల్లో పొందిన మార్కుల కన్నా ఎక్కువ మార్కులు సాధించాలని లక్ష్యం పెట్టుకుని దాని కనుగుణంగా పరీక్షల్లో ఏకాగ్రతతో సమాధానాలు రాయాలి. శక్తి సామర్థ్యాలకు మించి సత్ఫలితాలు సాధించాలని ఆశపడటం మంచిదే అయినప్పటికీ దానివలన ప్రతికూల ప్రభావాలు రాకుండా చూసుకోవాలి. పరీక్షలు అంటేనే అనవసరమైన ఆందోళన, శారీరక భావోద్వేగ ప్రతికూలతలకు దారి తీస్తాయని గ్రహించి వాటిని అధిగమించేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

తల్లిదండ్రులు గమనించాల్సిన అంశాలు:

పరీక్షలు అంటే విద్యార్థులకే కాకుండా వారి తల్లిదండ్రులకు పరీక్షా కాలం గానే భావించాలి.

పరీక్షలను రాసేది విద్యార్థులయినప్పటికీ వారి తల్లిదండ్రులు స్వయంగా పరీక్ష రాస్తున్న భావాన్ని కలిగి ఉంటారు.. ఈ క్రమంలో విద్యార్థుల పట్ల, తల్లిదండ్రులు పాజిటివ్ ఆలోచనతో ముందుకు వెళ్లాలే తప్ప వారిపై నెగిటివ్ ప్రభావం చూపే విధంగా ఉండకూడదు. విద్య విషయంలో అనవసర ఒత్తిడిని విద్యార్థులపై రుద్దకూడదు. పక్కవారితో పోల్చి చూపే ప్రయత్నం అస్సలు చేయకూడదు. ప్రతికూల ఒత్తిడి పెరిగిన విద్యార్థుల్లో ఏకాగ్రత సడలడమే కాకుండా ఆందోళన పెరిగి ఎక్కువ సమయం చదవలేక పోవడం జరుగుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యార్థులుకు వారిలో ఉండే శక్తి సామర్థ్యాలను గుర్తెరిగి, తదనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. అప్పుడే వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి అనుకున్న ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంటుంది.

పరీక్షా కాలంలో విద్యార్థులు ఒత్తిడికి గురై ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం లేకపోలేదు. వాటిని అధిగమించేందుకు విద్యార్థులు మధ్య మధ్యలో పాలు, టీ వంటివి తాగుతూ తగిన రీతిలో విశ్రాంతి తీసుకోవాలి. ఆహార సమతుల్యతను పాటించాలి. పరీక్షలు అంటే ఉన్న భయాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించుకునే అవకాశం ఉంటుంది.

విద్యార్థులు చేయవలసిన కార్యచరణ:

విద్యార్థులు చదివిన పాఠ్యాంశాలను గుర్తు చేసుకుంటూ రాతపూర్వకమైన అభ్యాసము చేయాలి. గత పరీక్షల్లో పొందిన మార్కుల కన్నా ఎక్కువ రావాలనే లక్ష్యాలు సత్ఫలితాలను ఇస్తాయి. నిన్నటి కన్నా నేడు మెరుగైన ప్రగతి సాధించగలమని నమ్మాలి. అనవసర ఆలోచనలకు స్వస్తి పలకాలి. ప్రతిభకు పదును పెట్టి శక్తి వంచన లేకుండా చదివి సత్ఫలితాలు సాధించాలి. ఒకసారి రాస్తే పదిసార్లు చదివినట్లే అని గ్రహించుకొని,ఆ విధంగా తర్ఫీదు పొందాలి.

ఉపాధ్యాయుల సూచనలు అవసరం:

పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాలను సాధించే విధంగా సలహాలు సూచనలు అందించాలి. ఒత్తిడిని తగ్గించాలి. సులభమైన చిట్కాలను సూచించాలి. ప్రశ్నలకు తక్కువ సమయంలో సమాధానం రాసే విధంగా తర్ఫీదు నివ్వాలి. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని ఉపాధ్యాయులే వెలికి తీసి ప్రోత్సహించాలి. సమాజంలో గురువుల స్థానం ఎల్లప్పుడూ అగ్రస్థానమే అనేది జగమెరిగిన సత్యం.

పరీక్షా కేంద్రానికి వెళ్లే సమయంలో:

పరీక్షలకు వెళ్లే విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ముందుగానే గుర్తించడంతోపాటు పరీక్షకు వెళ్లే సమయంలో అవసరమైన వస్తువులు (హాల్ టికెట్, పెన్నులు పెన్సిళ్లు ఇతర సామగ్రిని) ముందుగా సిద్ధం చేసుకోవాలి. పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకునేందుకు సిద్ధపడాలి. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరనే విషయంను విద్యార్థులు తప్పనిసరిగా గుర్తించుకోవాలి. విద్యార్థినీ, విద్యార్థులు పై విషయాలను ఆచరణలో పెట్టగలిగితే పరీక్షల ఒత్తిడి నుంచి బయటపడడమే కాకుండా సత్ఫలితాలను సాధించి అనుకున్న లక్ష్యాలను అందివుచ్చుకుంటారని చెప్పడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు.